క్లుప్తంగా

మహిళా నేతల ప్రచారం



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న దివ్యారెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 2, 3 వార్డుల పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు ఇంటింటా తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు శివప్రసాదరెడ్డిని, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కుమార్తె పల్లవి, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి సోదరి శిరీషరెడ్డి, దివ్యా రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కృష్ణ తేజ, మాజీ కౌన్సిలర్ పాతకోట కృష్ణవేణితోపాటు మున్సిపల్ మాజీ చైర్మన్ ఉండేల గురివిరెడ్డి, కౌన్సిలర్ ద్వార్శల భారతి, మూడో వార్డు ఇన్‌చార్జి కృష్ణార్జునరెడ్డి, ద్వార్శల గురునాథరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి ఆర్ట్స్ వార్షికోత్సవాలు



అవార్డులు అందుకున్న కళాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని శ్రీ కోదండరామస్వామి కల్యాణ మండపంలో శ్రీ చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ 9వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ కళలను కళాకారులను ప్రోత్సహిస్తున్న చౌడేశ్వరి ఆర్ట్స్ సంస్థ సేవలను కొనియాడారు. కేంద్ర బాల సాహిత్య అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు మాట్లాడుతూ వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి అవార్డులు అందచేయడం అభినందనీయమన్నారు. అవధాని డాక్టర్ నరాలరామారెడ్డికి అవధాన కళారత్న అవార్డు, చదువులబాబుకు బాల సాహితీ కళారత్న అవార్డు, పల్లేటి కులశేఖర్‌కు సాహిత్య కళారత్న అవార్డు, సాధు గోపాలకృష్ణకు సేవా కళారత్న అవార్డులను సంస్థ అధ్యక్షుడు కంభం పాములేటి అందించి సత్కరించారు. నటరాజ కళాక్షేత్రం నాట్యగురువు మోహిద్దీన్‌ఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థుల కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సాహిత వేత్త జింకా సుబ్రహ్మణ్యం, నటుడు పల్లా బాల నరసింహులు, కళాకారులు, కళాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

ప్రొద్దుటూరు : స్థానిక ఈశ్వర్‌రెడ్డి నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కంభం పాములేటి కుమారుడు అరుణ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, కసిరెడ్డి మహేశ్వరరెడ్డి సోమవారం సాయంత్రం అరుణ్ కుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.


ఎర్రగుంట్ల..
ప్రగతి మెరిసేనంట

ఉన్న ఊర్లోనే సచివాలయం కొలువు దీరింది. ప్రజా సమస్యలకు పరిష్కారం దొరికింది. ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటయ్యాయి. విద్యాలయాలకు నూతన శోభ చేకూరింది. శిథిలావస్థకు చేరిన భవనాలకు కొత్త వెలుగొచ్చింది. ఇంటి చెంతనే వైద్యం అందుతోంది. తాగునీరు నిత్యం సరఫరా అవుతోంది. అందమైన రోడ్లు.. డ్రైనేజీ నిర్మాణం ఏర్పాటు చేశారు. వెరసి ప్రగతి పరుగులెత్తింది. సంక్షేమం వెల్లివిరిసింది. దీంతో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారు.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



చిలమకూరులో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల సముదాయం



పట్టణంలోని నాలుగు లైన్ల జాతీయ రహదారి

- రూ. కోట్లతో అభివృద్ధి పనులు
- నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణం
- సర్వాంగ సుందరంగా ప్రభుత్వ పాఠశాలలు

ఎర్రగుంట్ల : మండలంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు నిండగా, ప్రగతి పండుగ లాగా సాగింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇంటర్, ఐటీఐ, డిగ్రీ కళాశాలలు మంజూరు చేశారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పరుగులు పెట్టింది.

నూతన భవనం



ఎర్రగుంట్ల నగర పంచాయతీ కార్యాలయం

నగర పంచాయతీగా ఏర్పడి పదేళ్లు దాటింది. ఈ క్రమంలో ఎస్ఎఫ్‌సీ, జనరల్ ఫండ్, స్టేట్‌గ్రాంట్ నిధుల నుంచి రూ.1.50 కోట్లతో నూతనంగా కార్యాలయ భవనం నిర్మించారు. ఉద్యోగులకు సౌకర్యంగా ఉంది. అన్ని హంగులతో ప్రజలకు పాలన అందిస్తోంది.

రైతుల లబ్ధి కోసం ఆర్బీకేలు



తుమ్మలపల్లిలోని రైతు భరోసా కేంద్రం

రైతులకు అన్ని విధాలుగా అందుబాటులో ఉండే విధంగా ప్రతి సచివాలయానికి అనుసంధానంగా ఆర్బీకేలు నిర్మించారు. ఎర్రగుంట్ల మండలంలో 14 ఏర్పాటు చేశారు. ఒక్కొక్క ఆర్బీకేకు రూ.30 లక్షల నిధులు వెచ్చించి నిర్మించారు.

ప్రభుత్వ కార్యాలయాలకు మహర్దశ



తహసీల్దార్ కార్యాలయం

ఎర్రగుంట్ల పట్టణంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు మహర్దశ పట్టింది. తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజాపరిషత్, పశువైద్యశాల భవనాలను నూతనంగా నిర్మించారు.

శుద్ధినీటి సరఫరా



నూతనంగా నిర్మించిన ఓవర్ హెడ్‌ట్యాంక్

ఎర్రగుంట్ల పట్టణ ప్రజలకు తాగునీటి అందించడానికి రూ.1.10 కోట్లతో రాణీవనంలో 4 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. కమలాపురం పుట్లంపల్లి, పోట్లదుర్తి పెన్నానది నుంచి ప్రత్యేక పైపులైన్‌లు ఏర్పాటు చేసి నిత్యం తాగునీటి సదుపాయం కల్పిస్తున్నారు. వార్డులలో అన్ని చోట్ల వాటర్ ప్లాంట్లను నిర్మించి శుద్ధినీటిని అందిస్తున్నారు.

సచివాలయాలు



చిలమకూరులో గ్రామ సచివాలయం

మండలంలో 14 గ్రామ సచివాలయ భవనాలు నిర్మించారు. ఒక్కొక్క భవనానికి రూ.40 లక్షలు వెచ్చించి నిర్మించారు. వీటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. దీంతో స్థానికంగానే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతున్నాయి.

పాఠశాలలు కళకళ



ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేటు స్థాయికి ఏ మాత్రం తీసిపోకుండా ఆధునీకరించారు. నాడు–నేడు ద్వారా అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో మొదటి దశలో 21 పాఠశాలలకు రూ.6.68 కోట్లు, రెండో దశలో 10 పాఠశాలలకు రూ.3.47 కోట్లు, రూరల్‌లో 17 పాఠశాలలకు రూ.3.58 కోట్ల నిధులు మంజూరు చేసి సర్వాంగ సుందరంగా నిర్మించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూరాయి.

జాతీయ రహదారి

ఎర్రగుంట్లలో నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణంతో పట్టణ రూపురేఖలే మారిపోయాయి. రూ.30 కోట్లతో ఈ రహదారి నిర్మించారు. మరో రూ.2 కోట్లతో ఆ దారి మధ్యలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. సెంట్రల్ లైటింగ్ మధ్యలో మరో రూ.6 లక్షలతో పచ్చదనం పెంచారు. ఈ రోడ్డు కడప, ఎర్రగుంట్ల, చిలమకూరు, ముద్దనూరు మీదుగా రాయలచెరువుకు వెళ్తుంది.

వలసపల్లి రోడ్డు నిర్మాణం



నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డు

ఎర్రగుంట్ల పట్టణంలో వలసపల్లె రోడ్డు అధ్వానంగా ఉండేది. డీఎంఎఫ్ నిధుల కింద రూ.2.50 కోట్లతో డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు నిర్మించారు. దీంతో 11, 12, 13, 14 వార్డుల ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. అంతేకాక సుందరయ్య కాలనీ వాసుల సౌకర్యం కోసం కాలువ వెంట రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్డు, బ్రిడ్జి నిర్మించారు.

24 గంటల ఆసుపత్రి



ఎర్రగుంట్ల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని చిలమకూరు, ఎర్రగుంట్ల పట్టణంలో 24 గంటల ఆసుపత్రి ఏర్పాటు చేశారు. ఎర్రగుంట్ల పట్టణంలో రూ.80 లక్షలతో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆధునీకరించారు. ఇందులో ముగ్గురు వైద్యులు ఉన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



ముద్దనూరు : మాట్లాడుతున్న డీఎస్పీ యశ్వంత్

ముద్దనూరు : సాధారణ ఎన్నికల్లో ప్రతి ఓటరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ టీడీ యశ్వంత్ పేర్కొన్నారు. మండలంలో ఫ్యాక్షన్ గ్రామంగా రికార్డులకెక్కిన చింతకుంటలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలకు పాల్పడకుండా, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, సీఐ దస్తగిరి సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లాగ్ మార్చ్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీ, ఆచార్ల కాలనీ, విరాట్‌నగర్, లింగారెడ్డి కొట్టాల, బుద్ధాయపల్లె, రాజీవ్‌సర్కిల్, టీబీ రోడ్డు, విజయకుమార్ సర్కిల్‌లో సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలతో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మోరగుడిలో ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న నారాయణరెడ్డి

జమ్మలమడుగు : మండల పరిధిలోని మోరగుడి గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ నారాయణ సోమవారం ఉదయం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డికి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

'వారితో ఏఐటీయూసీకి సంబంధం లేదు'

ప్రొద్దుటూరు : టీడీపీలో చేరిన వారితో ఏఐటీయూసీకి సంబంధం లేదని ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు వై.హరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో డ్రైవర్లు నరసింహులు, గురుస్వాములు ఏఐటీయూసీ పట్టణ నేతలని తమకు తాము టీడీపీ వారికి చెప్పుకొని టీడీపీలో చేరినట్టు వచ్చిన వార్తలను ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారు ఏఐటీయూసీలో ఎటువంటి బాధ్యతలు తాము ఇవ్వలేదని, వారి స్వార్థం కోసం వారు వెళ్లారే తప్ప ఏఐటీయూసీకి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. ఆటో డ్రైవర్లు వారిని విశ్వసించి మోసపోవద్దని సూచించారు.

1 నుంచి వేసవి శిక్షణ శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడురోడ్డులోని ఇస్కాన్ కేంద్రంలో మే 1 నుంచి 13 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మధురేశుదాసు ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8, 9 తరగతుల విద్యార్థులకు రోజూ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ధ్యానం, శ్లోకం, నైతిక విలువలు, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర వాటిలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షలో ప్రతిభ కనపరచిన వారికి ప్రథమ బహుమతిగా రూ.3,300, ద్వితీయ బహుమతిగా రూ.2,200, తృతీయ బహుమతిగా రూ1,100 అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 8520027510, 6303474393లకు సంప్రదించాలని కోరారు.

చెప్పింది చేశాం.. మరో అవకాశం ఇవ్వండి





ఎర్రగుంట్ల : ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఆయన సతీమణి క్రాంతిప్రియారెడ్డి, ముద్దనూరు : కరపత్రాలు పంపిణీ చేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

జమ్మలమడుగు : గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చామని, మరో సారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సోమవారం పట్టణంలోని నేతాజీ నగర్, పాత బస్టాండ్, ముద్దనూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, వైస్ చైర్మన్ సింగరయ్య, పోచిరెడ్డి, పోరెడ్డి మహేశ్వరరెడ్డి, కెకె రమణారెడ్డి, ముల్లాజానీ, ఈశ్వరరెడ్డి, కత్తిశ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆప్యాయంగా పలకరిస్తూ..

ఎర్రగుంట్ల : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఎర్రగుంట్ల పట్టణ పరిధి 8వ వార్డులోని వేంపల్లి రోడ్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇదే వార్డులో మరో పక్క ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి సతీమతి క్రాంతిప్రియారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టి.బాలయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జెక్కు చెన్నక్రిష్ణరెడ్డి, ఆ వార్డు కో–ఆప్షన్‌సభ్యులు డి.సూర్యానారాయరెడ్డి, పార్టీ నాయకుడు డి. వెంకట శివారెడ్డి పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

జమ్మలమడుగు : స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని చవ్వా జగదీశ్వరరెడ్డి, రాంరెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి కోరారు. జమ్మలమడుగు పట్టణంలోని 15వ వార్డు, గూడెంచెరువు గ్రామంలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంగదొడ్డి సింగరయ్య, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి

కొండాపురం : కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్ రెడ్డిలను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎ.భారతి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు చింతరాజారెడ్డి కోరారు. మండలంలోని కె.సుగుమంచిపల్లె గ్రామంలో వారు ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల ఉపాధ్యక్షులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు విశ్వనాథరెడ్డి, శ్రీరంగనాథరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ఆది బ్రదర్స్, గంగిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

ముద్దనూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి కోరారు. మండలంలోని గంగాదేవిపల్లె, కొర్రపాడు గ్రామాల్లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పుష్పలత, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, మూలారెడ్డి, విశ్వనాథరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ఆదినారాయణ, మునిరెడ్డి, వీరారెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

అబద్ధాల కోరు 'ఆది'

– ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఐదేళ్లకు ఒక్కసారి ప్రజల వద్దకు వస్తాడు... అబద్ధాలు చెబుతూ, మోసపూరిత మాటలతో నమ్మించడానికి ప్రయత్నిస్తున్నాడని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎర్రగుంట్ల పట్టణం 8వ వార్డులోని ఎస్సీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎర్రగుంట్లను నగర పంచాయతీగా చేసి పన్నుల భారం ప్రజలపై మోపిన ఘనుడు ఆదినారాయణరెడ్డి అన్నారు. ఆయన 15 ఏళ్ల రాజకీయంలో ఎక్కడైనా వార్డులో తిరిగాడా.. ప్రజా సమస్యలు తెలుసుకున్నాడా అని విమర్శించారు. దళితవాడలో ఎప్పుడైనా తిరిగాడా, ఇక్కడ ఎన్ని ఓట్లు ఉన్నాయో తెలుసా అని ధ్వజమెత్తారు. దళితవాడను అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. అది, ఇది కట్టిస్తామని అబద్ధాల చెబుతా.. ముందు అభివృద్ధి పనులకు గాను డబ్బును డిపాజిట్ చేయి.. ఎందుకంటే మే 14వ తేదీ తర్వాత కన్పించకుండా క్లబ్‌లకు పరిమితం అవుతాడని అన్నారు. నీవు నన్ను తిడుతావు, మా సీఎం వైఎస్ జగనన్నను, మా ఎంపీ వైఎస్ అవినాషరెడ్డిని, విజయమ్మను తిడుతావు ముందు నీవు నీకుటుంబ సభ్యులైన నీ అన్న, అన్న కుమారిడి గొంతు కోసినావు అని విమర్శించారు. కేశవరెడ్డి బాధితులకు డబ్బులు నీవే ఇవ్వాలి... వారికి చేయలేని న్యాయం, ప్రజలకు ఎలా చేస్తావు అని విమర్శించారు. జమ్మలమడుగు ఐదేళ్లు ప్రశాంతంగా ఉంది... ఇప్పుడు నీవు వచ్చి గొడవలు పెడుతున్నామని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు డి. సూర్యనారాయణరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు జెక్కు చెన్నక్రిష్ణారెడ్డి, వై విశ్వభార్గవరెడ్డి, పార్టీ నాయకులు గంగశివారెడ్డి, రాజారెడ్డి, వై శ్రీధర్‌రెడ్డి, గంగాక్రిష్ణారెడ్డి తదిరులు పాల్గొన్నారు.

15 ఏళ్లు అప్పు చెల్లించకుండా నీతి పరులమంటే ఎలా?

- కొండారెడ్డికి అధికారం ఇస్తే గ్యాంగ్‌స్టర్ అవుతాడు
- ప్రజలు ఆలోచించి విజ్ఞతతో ఓటేయాలి
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలో ప్రముఖంగా ఆర్యవైశ్యులకు 2009లో చేసిన అప్పులు ఇప్పటికీ చెల్లించకుండా తాము నీతిపరులమంటే ఎలా అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. పొరపాటున టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డికి ప్రజలు అధికారం ఇస్తే పైకి సున్నితంగా కనిపించే ఆయన కుమారుడు కొండారెడ్డి మరో గ్యాంగ్ స్టర్ అవుతారని అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్లు అతి దగ్గరలో ఉన్నాయని, ప్రజలు వాస్తవ పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తూ అప్రమత్తులై వ్యవహరించాలన్నారు. రౌడీలకు, అబద్ధాలు చెప్పే వారికి ఓటు వేయవద్దని తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సభలో కొండారెడ్డి ఇప్పటికైనా ఆర్యవైశ్యులకు చేసిన అప్పులు చెల్లిస్తానని చెప్పినందుకు సంతోషంగా ఉందన్నారు. వాస్తవాలన్నింటిని ఆయన అంగీకరించారన్నారు. 2009లో వన్ ప్లస్ వన్ స్కీం కోసం ఆర్యవైశ్యుల వద్ద తీసుకున్న డబ్బు నేటికీ చెల్లించలేదని, ఆ స్కీం ఇప్పుడు స్కాంగా మారిందన్నారు. కొండారెడ్డి ఈ విషయంపై మాట్లాడుతూ రాఘవరెడ్డి కుమారుడు రవికి ఈ డబ్బు ఇప్పించామని తెలిపారన్నారు. మాలెపాటి సత్యంకు రూ.4.20 కోట్లు చెల్లించాల్సి ఉండగా తాను నిర్మించిన రెండు అపార్ట్‌మెంట్లను రాయించి రూ.కోటి 80 లక్షలు బాకీలో చెల్లించారన్నారు. ఇప్పటికీ ఆ ప్లాట్లను వారికి రిజిస్ట్రేషన్ చేయించలేదన్నారు. మిట్టా శివగణేష్‌పై జరిగిన దాడికి సంబంధించి తాము దాడి చేయలేదని, ఆయన ఒప్పుకోకపోవడంతో సంతకాలు చేయించామని బుకాయిస్తున్నారన్నారు. కొండారెడ్డిని నమ్మి లారీ శ్రీను, ఎర్రచంద్ర, వద్ది బాలుడు లాంటి వారెందరో అప్పులు ఇచ్చి ఎగ చూస్తున్నారన్నారు. వరదరాజుల రెడ్డి కుటుంబీకులు నీతి పరులైతే కాలపరిమితి దాటిన అప్పులు చెల్లించి ఎన్నికల్లో పోటీ చేయాలని కోరారు.

పైకి కనిపించినంత సౌమ్యుడు కాదు కొండారెడ్డి

పొరపాటున ఓటర్లు వరదరాజులరెడ్డిని గెలిపిస్తే వృద్ధాప్యంలో ఉన్న ఆయన అధికారాన్ని అనుభవించే పరిస్థితి లేదని, ఆయన కుమారుడు కొండారెడ్డిదే పెత్తనమంతా ఉంటుందని తెలిపారు. తనపై హత్యాయత్నం, విజయవాడలో ఆస్తి కోసం బ్రాహ్మణుడైన ఆడిటర్ హత్య, ఈవీ సుధాకర్‌రెడ్డి, మిట్టా శివగణేష్‌లపై దాడి, ఇలా ఎన్నో వాటిలో కొండారెడ్డి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉన్నారన్నారు. కొండారెడ్డిది క్రిమినల్ మైండ్ అని, ఆర్థిక నేరగాడు అని తెలిపారు. సిటీ హబ్ రాజేశ్వర రెడ్డికి కూడా రూ.6 కోట్లు బాకీ చెల్లించాల్సి ఉందని, డీఏడబ్ల్యూ కళాశాలలో అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారని తెలిపారు. నేర ప్రవృత్తి మనస్తత్వంగల కొండారెడ్డిని చూసి పట్టణంలో అశాంతికి చోటు ఇవ్వకుండా ఓటు వేయాలని కోరారు.

రాచమల్లుకు సేవా గుణం

ఆటో కార్మికులు ట్యాక్స్‌ను చెల్లించేందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గతంలో తమకు రూ.40 లక్షలు ఇచ్చారని అమృతానగర్‌కు చెందిన ఆటో యూనియన్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యూనియన్ కార్మికులు మాట్లాడుతూ రాచమల్లుకు మాత్రమే సేవా గుణం ఉందని తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పాతకోట వంశీధర్‌రెడ్డిని కార్మికులు సన్మానించారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ కార్యదర్శి వేంపల్లి సురేంద్రనాథరెడ్డి, 11వ వార్డు ఇన్‌చార్జి కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి దివ్యాంగుల మద్దతు



ఎమ్మెల్యే రాచమల్లును సన్మానిస్తున్న సొసైటీ నాయకులు

ప్రొద్దుటూరు : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని ఆల్ ఆఫ్ యూ దివ్యాంగులు, వృద్ధుల సొసైటీ అధ్యక్షుడు అఫ్జల్, అబ్దుల్ రషీద్ తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్‌సీపీకి తమ మద్దతు ఉంటుందని వారు తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు శివప్రసాదరెడ్డిని, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు తాను ఎప్పుడు అండగా ఉంటానని, వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లును దివ్యాంగులు సత్కరించారు.

క్లుప్తంగా

గజ వాహనంపై ముక్తిరామలింగేశ్వరుడు



గజవాహనంపై గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీ ముక్తిరామ లింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం గజ వాహనంపై ముక్తిరామలింగేశ్వరున్ని ఊరేగించారు. వేకువజామున సైకతలింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి, చండీమాతకు, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను రాత్రి గజవాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో శివనామస్మరణల మధ్య ఊరేగించారు. మంగళవారం ఉదయం ముక్తిరామ లింగేశ్వరస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వినియోగం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి కోరారు.

అరటి తోట దగ్ధం

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ భాకరాపేటకు చెందిన రైతు, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు నాగం మల్లికార్జునరెడ్డికి చెందిన అరటి తోట అగ్నికి ఆహుతి అయింది. సోమవారం బాధిత రైతు మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి పంచాయతీ పేరయ్యగానిపల్లె గ్రామ సమీపాన ఉన్న 7ఎకరాల భూమిలో రూ. 14లక్షలు ఖర్చు చేసి అరటి పంటను సాగు చేశానన్నారు. ఆదివారం మధ్యాహ్నం తాను ఇంటి వద్ద ఉండగా... అరటి తోట కాలుతోందని సమాచారం రావడంతో హుటా హుటిన పొలం వద్దకు వెళ్లానన్నారు. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. వీలు కాక పోవడంతో కడప అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో కడప నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. అప్పటికే పంట పూర్తిగా కాలిపోయిందని ఆవేదన చెందాడు.

ఆకస్మిక తనిఖీ

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రిని సోమవారం డీసీహెచ్‌యస్ డాక్టర్ హిమాదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఓఆర్‌యస్ పాకెట్ల పంపిణీ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఇదే సందర్భంలో ఆరోగ్యశ్రీ జిల్లా మాజీ కో ఆర్డినేటర్ డాక్టర్ మార్కారెడ్డి ఆమెను కలిశారు. ఆసుపత్రిలో పని చేస్తున్న గైనకాలజిస్టు ప్రస్తుతం అందుబాటులో లేక పోవడం వలన రోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వైద్యురాలిని నియమించాలని కోరారు. అలాగే నూతన భవనంలో ఓపీ ఏర్పాటు చేయాలని కోరారు. మార్కారెడ్డి సూచనలపై డాక్టర్ హిమాదేవి సానుకూలంగా స్పందించారు. స్త్రీల వ్యాధి నిపుణురాలిని త్వరలో నియమించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నాగలక్ష్మి, సునీల్, వైద్యసిబ్బంది ఉన్నారు.

అభివాదం చేస్తూ.. అనురాగం చూపిస్తూ..

వేంపల్లిలో సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి విస్తృత ప్రచారం

వేంపల్లె : వేంపల్లెలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిరెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సతీమణి వైఎస్ సమతారెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మెన్ సతీష్‌కుమార్‌రెడ్డి సతీమణి సుమతిరెడ్డిలు సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ముందుగా వీరికి మహిళలు హారతులు పట్టి బ్యాండు వాయిద్యాలతో స్వాగతం పలికారు. జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిగాయత్రిలు వైఎస్ భారతిరెడ్డి, వైఎస్ సమతారెడ్డిలకు దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలను అందించి ఘన స్వాగతం పలికారు.

స్థానిక వైఎస్ఆర్‌సీపీ కార్యాలయం నుంచి నాలుగురోడ్ల కూడలి, గాంధీరోడ్డు, అమ్మవారిశాల వీధి, మెయిన్ బజార్, పాతపేట, కాపువీధి, జీఎం కాంప్లెక్స్, కాలేజీరోడ్డు, రాఘవేంద్ర స్కూల్ ఏరియా, బిడాలమిట్ట వీధులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ఐదేళ్ల కాలంలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే ప్రస్తుత మేనిఫెస్టోలో పొందుపరచిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ జోరుగా ప్రచారాన్ని కొనసాగించారు. ఇంటింటా ప్రచారంలో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా చిరునవ్వుతో పలకరిస్తూ పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ వైఎస్ఆర్‌సీపీకే ఓటు వేస్తామని చెప్పడంతో వారు చిరునవ్వుతో ముందుకుసాగారు. వికలాంగులు, వృద్ధులు, దుకాణదారులు, చేతివృత్తులు చేసుకునేవారు, అనారోగ్యంతో మంచంలో ఉన్న వారిని కూడా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండండి.. మళ్లీ మన జగనన్న ప్రభుత్వమే వస్తుందని వారికి భరోసా కల్పిస్తూ ప్రచారాన్ని ముందుకు సాగించారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మళ్లీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మెన్ సతీష్‌కుమార్‌రెడ్డి కుమారులు తుషార్ నాగిరెడ్డి, రోహన్ నాగిరెడ్డి, హజ్‌హౌస్ రాష్ట్ర డైరెక్టర్ మునీర్ బాషా, మైనింగ్ అండ్ మినరల్స్ రాష్ట్ర డైరెక్టర్ సల్మా, మాజీ జడ్పీటీసీ సభ్యులు షబ్బీర్‌వలి, డా.ఎస్ఎఫ్ బాషా, యూత్ కన్వీనర్ రవిశంకర్ గౌడ్, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి



వ్యాపారస్తులకు అభివాదం చేస్తున్న వైఎస్ భారతిరెడ్డి



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్ భారతిరెడ్డి



మాజీ సర్పంచ్ రామలింగయ్యతో మాట్లాడుతున్న వైఎస్ భారతిరెడ్డి



సంక్షేమ కరపత్రాలను అందజేసి ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్ సమతారెడ్డి



ప్రచారంలో పాల్గొన్న మహిళలు

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

పులివెందుల : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. సోమవారం ఆయన పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అన్నారు. ఎలాంటి భయాలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరు వచ్చే నెల 13న జరిగే పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఆయన సమస్యాత్మకంగా ఉన్న బూత్‌ల గురించి తెలుసుకుని అక్కడ పర్యటించి పోలీసు అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐలు మద్దిలేటి, శంకర్‌రెడ్డి, ఎస్సై అరుణ్‌రెడ్డిలతో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నల్లపురెడ్డిపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడిన ఎర్రచందనం స్మగ్లర్‌తో అధికారులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల అటవీ ప్రాంతంలో 101 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు సోమవారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం అందిన సమాచారం మేరకు మల్లెపల్లి సెక్షన్ ఇటుకుళ్లపాడు అడవిలో చందనాలబోడు నుంచి కూంబింగ్ నిర్వహించగా ఎర్రబావిచెరువు వద్ద రవాణాకు సిద్ధం చేసిన ఎర్రచందనం దుంగలు, మినీ లారీ కనుగొన్నామన్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని గమనించిన స్మగ్లర్స్ పారిపోగా ఒకరిని పట్టుకొన్నారన్నారు. ముదిరెడ్డిపల్లెకు చెందిన కొమరోలు అంకయ్యగా గుర్తించామన్నారు. దుంగలతో పాటు టాటా గూడ్స్ క్యారియర్, రెండు మోటార్ బైకులు స్వాధీనం చేసుకున్నామన్నారు. దుంగలు 2959 కేజీల బరువున్నాయని, వీటి విలువ కోటి రూపాయలు ఉంటుందన్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. కూంబింగ్‌లో డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ చిరంజీవి, ఆర్ ఎస్ఐలు మురళీధర్‌రెడ్డి, నరేష్ బృందం పాల్గొందన్నారు. ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి రివార్డులు ఇచ్చారు.

డ్యూయల్ డిగ్రీ అవకాశాన్ని వినియోగించుకోండి

వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : ఒకే విద్యా సంవత్సరంలో రెండు డిగ్రీలు చదువుకునే అద్భుత అవకాశం నేటి విద్యార్థులకు, ఉద్యోగులకు, అన్ని వర్గాలకు ఉందని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం వైవీయూలోని సెనేట్‌హాల్లో దూర విద్యా సంచాలకులు ఆచార్య కె. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రెగ్యులర్, ఆన్‌లైన్, దూరవిద్య కోర్సులు సమానమేనన్నారు. ప్రభుత్వం కూడా వీటికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. రెగ్యులర్ కోర్సుల తీరులోనే మిగిలిన వాటికి సెమిస్టర్ విధానం అమలవుతుందన్నారు. జాతీయ విద్యావిధానం-2020 ప్రకారం విద్యార్థి కేంద్రీకృతంగా విద్య వచ్చిందన్నారు. ప్రతి విద్యార్థి డిగ్రీ, పీజీ రెగ్యులర్ కోర్సులతో పాటు దూరవిద్య కోర్సులను ఒకే అకడమిక్ ఇయర్‌లో చదువుకోవచ్చు అన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో రెండింటికీ సమాన విలువ ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ డ్యూయల్ డిగ్రీ చదువుకునే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. వైవీయూలో లభించే దూర విద్య కోర్సులకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. దూరవిద్య సంచాలకులు ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వైవీయూలో అందుబాటులో ఉన్న 8 కోర్సుల గురించి వివరించారు. ఫిజికల్ మోడ్, ఓడిఎల్ విధానం, ఆన్‌లైన్ స్టడీ గురించి వివరించారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య తప్పెట రామ ప్రసాద్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

‘షరబత్ మొక్కలు కాల్చివేత’



కాలిపోయిన నన్నారి మొక్కలు

పోరుమామిళ్ల : రెండేళ్లుగా సాగు చేసుకుంటున్న నన్నారి మొక్కలను ప్రత్యర్థులు దగ్ధం చేశారని తిమ్మారెడ్డిపల్లెకు చెందిన చిట్టిబోయిన దుగ్గయ్య, బొడ్డు దుగ్గయ్య ఆరోపించారు. సోమవారం గ్రామానికి చెందిన కోనయ్య కుమారులు దుగ్గయ్య, రామలక్షుమయ్య తమపై కక్ష పెంచుకుని నిప్పు పెట్టడంతో చెట్లు, పైపులు కాలి పోయాయని వాపోయారు. పోలీసులు విచారించి చర్య తీసుకోవాలని బాధితులు కోరారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలతో వలంటీర్లు

గోపవరం : మండలంలోని రాచాయపేట సచివాయలం పరిధిలోని రాచాయపేట, బెడుసుపల్లె, అగ్రహారం, చెన్నవరం గ్రామాల్లో పనిచేస్తున్న 16 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి నిఖితకు ఇవ్వగా ఆమె ఎంపీడీఓ రాధాకృష్ణన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్లుగా పనిచేసి పార్టీలు, కులాలకు అతీతంగా ప్రజలకు సేవ చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

చెన్నూరు : చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కడప-రాజంపేట బైపాస్ పాలంపల్లె వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన జింకా సుబ్బరాయుడు (75), ద్వీపం సుబ్బన్న (65) వ్యక్తిగత పనుల కోసం రామనపల్లి నుంచి కడపకు టీవీఎస్‌పై వెళుతుండగా దేవుని కడప నుంచి బైపాస్ మీదుగా అలంఖాన్‌పల్లెకు వెళుతున్న సెప్టిక్ ట్యాంక్ వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో సుబ్బరాయుడు తలపై తీవ్రమైన గాయం కావడం వల్ల అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన సుబ్బన్నను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే ముస్లింల సంక్షేమం

బద్వేలు అర్బన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ముస్లింల సంక్షేమం సాధ్యమని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజం, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులోని సుమిత్రానగర్, ముబారక్‌నగర్, మహబూబ్‌నగర్, బండలవీధిలలో ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్య, ఉద్యోగ అవకాశాల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పించారని, ఆ రిజర్వేషన్‌ను ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తూ వస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు అల్లాబకాష్, సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఉమర్, వైవీయూ పాలక మండలి సభ్యులు కె.సి.సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు యద్దారెడ్డి, బాబ్జీ, కౌన్సిలర్లు మౌలాలి, హసన్, ఓబుల్‌రెడ్డి, రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



సుమిత్రానగర్‌లో ప్రచారం చేస్తున్న హజ్ కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్

మోదీ హయాంలో క్రైస్తవులకు రక్షణ కరువు



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

బద్వేలు అర్బన్ : ప్రధాని మోదీ హయాంలో క్రైస్తవులకు రక్షణ కరువైందని, చర్చిలపై దాడులు జరుగుతున్నా పాస్టర్ల పక్షాన పట్టించుకునే నాథుడే లేడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జీ.ఈశ్వరయ్య పేర్కొన్నారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని రాఘవేంద్ర గ్రాండ్ ఫంక్షన్ హాలులో క్రైస్తవ సంఘ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత ప్రచారం పేరుతో పాస్టర్లపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. బీజేపీ పాలనలో మణిపూర్‌లో క్రైస్తవులను ఊచకోత కోసి మారణహోమం సృష్టించారని తెలిపారు. చంద్రబాబు భయంతోనే బీజేపీతో జతకట్టారని, ప్రేమతో కాదని విమర్శించారు. సమావేశంలో పాస్టర్లు శ్యాముల్, మోజెస్, కుమార్, సీపీఐ పట్టణ నాయకులు బాలు, అనిల్ పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

దువ్వూరు : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం మైదుకూరులో జరగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం దువ్వూరులోని సీవీపీ కల్యాణ మండపంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి అధ్యక్షుడు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిరాకి బాషా, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఓబుళకొండారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, నాయకులు సంగన హరినాథరెడ్డి, బొంతపల్లె సుబ్బారెడ్డి, కోగటం వీరారెడ్డి, నారుపల్లె అంకిరెడ్డి, గోపిరెడ్డి ఓబుళరెడ్డి, సయ్యద్ అతావుల్లా పాల్గొన్నారు.

వైఎస్ కుటుంబమంతా జగన్ వెంటే

వైఎస్సార్ సోదరుడు వైఎస్.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్ కుటుంబమంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉందని దివంగత వైఎస్సార్ సోదరుడు వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఇక్కడి ఐఎంఏ హాలులో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు, న్యాయవాదులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ తాము వైజాగ్‌లో ఉంటామని, ఎప్పుడైనా ఎన్నికల సమయంలో మాత్రమే ఇక్కడికి వచ్చి ప్రచారం చేస్తుంటామన్నారు. ఇటీవల తాను పాడేరులో ఒక పాఠశాలను చూశానని, హైదరాబాద్‌లో కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో మౌళిక వసతులు ఉన్నాయని తెలిపారు. విద్యారంగంలో సీఎం వైఎస్ జగన్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. మీ కుటుంబాలకు మేలు జరిగి ఉంటేనే తనకు ఓటేయమని అడిగిన సీఎం దేశంలో ఎవరూ లేరని ప్రశంసించారు.



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వైఎస్ కుటుంబీకులు, సజ్జల భార్గవ్‌రెడ్డి తదితరులు



సమావేశంలో పాల్గొన్న వైద్యులు, మేధావులు

- వైఎస్ విమలమ్మ కుమార్తె వైఎస్ దివ్యారెడ్డి మాట్లాడుతూ జగనన్న నవరత్నాలతో ఇచ్చిన భరోసాతో పేద ప్రజలు ఎలాంటి ఆందోళన లేకుండా జీవిస్తున్నారన్నారు. జగనన్న సీఎం అయ్యాక రెండేళ్లు కోవిడ్‌కే పోయిందని, ఈ మూడేళ్లలో ఎన్నికల్లో చెప్పినవన్నీ చేశారన్నారు. ఇంకో ఐదేళ్లు అవకాశమిస్తే ఇంకెంత చేస్తాడో ఆలోచన చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కడప రూపురేఖలు సమూలంగా మారిపోయాయన్నారు. విద్యారంగంపై జగనన్నకు ప్రత్యేక విజన్ ఉందని, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేగా అంజద్‌బాషాను గెలిపించాలని కోరారు.
- వైఎస్ సుమధుర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ కుటుంబంలో జగన్ ఒంటరి అయ్యాడనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కుటుంబమంతా ఆయనతో ఉందని చెప్పారు. తన సంక్షేమ పథకాలతో జగనన్న పేదల జీవితాలను మార్చేశాడని తెలిపారు. నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చి వైఎస్ఆర్ కంటే రెండు అడుగులు ముందుకేసి ప్రజలకు మేలు చేస్తున్నారని తెలిపారు.
- జేసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన సాగిందన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రానికి రూ.30 వేల కోట్లు పెట్టుబడులు వస్తే, సీఎం వైఎస్ జగన్ హయాంలో లక్షా ముప్పైవేల కోట్లు వచ్చాయని తెలిపారు. టీడీపీ మేనిఫెస్టోను అమలు చేయాలంటే సాధ్యం కాదన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను ఆలోచించి ఓటేయాలని కోరారు.
- యూఎస్ఏ ప్రతినిధి పందుగాయల రత్నాకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పిల్లలు యూఎస్‌ఏకు వెళ్లడం సామాన్యమైన విషయం కాదన్నారు. రాష్ట్రంలో రూ.80వేల కోట్లు ఒక్క విద్యారంగానికే ఖర్చు చేస్తున్నారని చెప్పారు. అనంతరం సజ్జల భార్గవ్‌రెడ్డి వైద్యులు, న్యాయవాదులు, మేధావుల సలహాలు, సూచనలు స్వీకరించారు.
- ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు చైతన్యరెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


VOTE FOR FAN VOTE FOR FAN VOTE FOR FAN VOTE FOR FAN
జననేత జగనన్నకు
స్వాగతం.. సుస్వాగతం...
వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ
మేనిఫెస్టో 2024
ఫ్యాన్ గుర్తుకు ఓటేద్దాం...
జగనన్న సంక్షేమ పాలన కొనసాగిద్దాం...
మన ఎన్నికల గుర్తు
ఫ్యాన్
పోలింగ్ తేది : 13.05.2024
ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు మైదుకూరులో
జరిగే బహిరంగ సభకు విచ్చేయుచున్న
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ వై.యస్. జగన్‌మోహన్‌రెడ్డి గారికి
స్వాగతం - సుస్వాగతం
స్థలం : రాయల్ సర్కిల్ , ప్రొద్దుటూరు రోడ్,
సమయం : మధ్యాహ్నం 12:00 గం॥లకు
తేది : 30.04.2024 - మంగళవారం
బహిరంగ సభకు నియోజకవర్గ ప్రజలు, నాయకులు,
కార్యకర్తలు, అభిమానులు విరివిగా పాల్గొని
జయప్రదం చేయవలసినదిగా ప్రార్థన
సదా మీ సేవలో.....
వై.ఎస్.అవినాష్‌రెడ్డి
కడప పార్లమెంట్ YSRCP అభ్యర్థి
శెట్టిపల్లె రఘురామిరెడ్డి
మైదుకూరు నియోజకవర్గ YSRCP అసెంబ్లీ అభ్యర్థి
VOTE FOR FAN VOTE FOR FAN VOTE FOR FAN VOTE FOR FAN